


## శిథిలావస్థకు యనమదల వంతెన

ప్రజాశక్తి-రామచంద్రపురం

భారీ వర్షాలకు యనమదల నుంచి రామచంద్రపురం వచ్చే రహదారిలో వంతెన కూలడానికి సిద్ధంగా ఉంది. 1980లో నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. వంతెన కూలిపోతే యనమగల, తాటిపల్లి గ్రామాలకు రామచంద్రపురానికి రాకపోకలు నిలిచిపోతాయి. విషయం తెలుసుకున్న ఆర్‌డిఒ సుధాసాగర్, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్అండ్ బి అధికారులు సూర్యనారాయణ తదితరులు వంతెన పరిశీలించారు. ఈ వంతెనకు ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేయాలని, కొత్త వంతన నిర్మాణానికి అధికారులు రాజకీయ నాయకులు సహకరించాలని గ్రామ సర్పంచ్ పంపన వీర వెంకటరమణ, యనమదల గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.


వంతెన పరిశీలిస్తున్న ఆర్‌డిఒ, తహశీల్దార్

# ముంచుకొస్తున్నది

- ధవళేశ్వరం వద్ద పెరుగుతున్న నీటిమట్టం
- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- లంకగ్రామాల్లో అధికారులు అప్రమత్తం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎగువన కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గోదావరికి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. భద్రాచలం వద్ద ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకుంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరదనీటి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి ఇక్కడ కూడా మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరదనీరు చేరుకునే అవకాశం కనిపిస్తుంది. ఆదివారం రాత్రికి భద్రాచలం వద్ద 43 అడుగుల నీటి మట్టం చేరుకుంది. దీంతో ఆక్కడ మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. అక్కడ నుంచి దిగువకు 8,85,224 క్యూసెక్కుల నీరు పోలవరం ప్రాజెక్టుకు చేరకుటోంది. ఇదే సమయంలో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 10.50 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో బ్యారేజీకి చెందిన 175 గేట్లను పైకి లేపి 8,18,653 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం డెల్టా కాలువలకు 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

వరదలతో బ్యారేజీ ఎగువన ఉన్న సీతానగరం మండలంలో బొబ్బిల్లంక, ములకల్లంకలు వరదనీటిలో చిక్కుకున్నాయి. ఈ ప్రాంతాలను ప్రత్యేక అధికారులు పర్యటించారు. కొండ వాగుల నుంచి వరదనీరు పోటెత్తడంతో కొవ్వాడ కాలువ పొంగింది. దీంతో తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పోచవరం, తాడిపూడి, గజ్జరం, అన్నదేవరపేట, పెద్దేవం, తిరుగుడుమెట్ట, మలకపల్లి గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. నిడదవోలు మండలంలో ఎర్రకాలువ ఉధృతికి కంసాలిపాలెం, సింగవరం, రావిమెట్ట, జె.కండ్రిగ, గ్రామాల్లో పలుకాలనీలు ముంపునకు గురయ్యాయి. జిల్లాలో ఇప్పటికే 15వేల హెక్టార్లలో వరి, మరో మూడు వేల ఎకరాల్లో నారుమళ్లు, ఇవిగాక 60 గ్రామాల్లో ఉద్యాన పంటలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలోకి బురదకాలువ కారణంగా పంటచేలు, కూరగాయల పంటలు ముంపునకు గురయ్యాయి. వరదనీరు గ్రామాన్ని ముంచెత్తింది. ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు.


ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద విడుదలవుతున్న గోదావరి వరద

### భయంగుప్పెట్లో లంకలు

గోదావరి ఉగ్రరూపం దాల్చుతుండటంతో లంక గ్రామాలు భయం గుప్పెట్లో కొట్టుమిట్టాడుతున్నాయి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొత్తపేట, పి.గన్నవరం, అయినవిల్లి, అమలాపురం రూరల్, రావులపాలెం, రామచంద్రపురం మండలాల్లో లంక గ్రామాలను అధికారులు అప్రమత్తం చేశారు. ఇప్పటికే మామిడికుదురు మండలంలో కొనకాయిలంక కాజ్‌వేపైకి వరద నీరు చేరింది. ఈ ప్రవాహం మరింత పెరిగితే ఉభయ గోదావరి జిల్లాల మధ్య రాకపోకలకు అంతరాయం కలుగనుంది.

### అధికారుల చర్యలు

వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో కలెక్టర్ పి.ప్రశాంతి పర్యటించారు. ముంపు ప్రాంతాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కోనసీమ జిల్లా రామచంద్రపురంలో బలహీనంగా ఉన్న ఏటిగట్ల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డిఒ సుధాసాగర్ అధికారులకు సూచించారు. కోటిపల్లి నుండి సుందరపల్లి వరకు గల గోదావరి ఏటిగట్టును అధికారులతో కలిసి పరిశీలించారు. ముమ్మిడివరంలో నీటమునిగిన పంట పొలాలను ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు హామీ ఇచ్చారు.


సీతానగరంలో కుంగిన ఏటిగట్టును పరిశీలిస్తున్న అధికారులు


మామిడికుదురులో కనకాయిలంక కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరదనీరు

## విద్యార్థుల భాగస్వామ్యంతోనే సమసమాజ స్థాపన

**ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలోఅవగాహన**

ప్రజాశక్తి-అమలాపురం

సమసమాజ స్థాపనలో విద్యార్థులు భాగస్వామికావాలని సైన్స్ ఆధారత సమాజాన్ని నిర్మాణం చేయడానికి అభ్యుదయ భావజాలాన్ని అలవర్చుకోవాలని పలువురు వక్తలు అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో విద్యార్థుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ విద్యను కాషాయకరణ చేస్తూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూఢనమ్మకాలను విద్యార్థుల్లో భావవాద భావజాలాన్ని మతోన్మాద భావజాలాన్ని పెంపొందించేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. ఎస్ఎఫ్ఐ 1970లో ఏర్పడిందని నాటినుండి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులు పట్ల అవలంబిస్తున్న విద్యారంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా నికరంగా పోరాటం చేస్తోందన్నారు. ఎస్ఎఫ్ఐలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. దేశవ్యాప్తంగా నీట్ ఎంసెట్లో పేపర్ లీకేజీల వల్ల వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందన్నారు. నీట్ లీకేజీ పైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్ కాలేజీలు రూ.లక లు విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేస్తున్నాయని నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు సంక్షేమ హాస్టల్లో పరిస్థితి చాలా దయనీయంగా ఉందన్నారు. వీటిపై ఎస్ఎఫ్ఐ ఎప్పటికప్పుడు పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తుం దన్నారు. ఈ జిల్లాలో గత నెల రోజులుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్లో సర్వే చేసామని ఈ నివేదికను భవిష్యత్తులో జిల్లా కలెక్టర్ కి అందిస్తామని ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటి వి.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పెంకే వెంకటేశ్వరావు ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కే శంకర్ నాయకత్వం వహించారు. విద్యార్థులకు సైన్స్, కె.గణేశ్వరరావు మ్యాథ్స్ నందు, ఆర్.వెంకటేశ్వరావు ఇంగ్లిష్ నందు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చింతా శ్యామ్ కుమార్ జాదూగార్ మెజీషియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ రకాల మ్యాజిక్స్ చేస్తూ సైన్స్‌ని నిజ జీవితంలో ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలియజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా ప్రేమ్ కుమార్‌ను, కోకన్వీనర్‌గా శశి, మరో కోకన్వీనర్‌గా సత్య ప్రసాద్, వసంతి మరో 20 మంది సభ్యులతో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు కారెం వెంకటేశ్వరరావు, జి.దుర్గాప్రసాద్, టి.నాగ వరలక్ష్మి, అమూల్య, బేబీ గంగారత్నం, సత్య వెంకట్ లక్ష్మి, నాగలక్ష్మి, పొలమూరి శ్రీనివాసరావు, తాడి శ్రీరాంమూర్తి, భీమాస శ్రీను, టి.మోహనరాలు, బిఎన్. వెంకటేశ్వ రరావు, బిఎన్.శివకుమార్, యుటిఎఫ్ నాయకులు మురుగేశ్వరరావు, జివి రమణ తదితరులు పాల్గొన్నారు.


అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న రామ్మోహన్

## కిడ్నీ బాధితుని రూ.50 వేల సాయం

ప్రజాశక్తి-కొత్తపేట

గల్ఫ్ శెట్టి బలిజ యువశక్తి ఆధ్వర్యంలో మంత్రి సుభాష్ చేతులు మీదుగా కిడ్నీ బాధితుడికి రూ.50 వేల సాయం అందజేశారు. బిళ్లకుర్రు శివారు మట్టపర్తి వారి పాలెం గ్రామానికి చెందిన మట్టపర్తి వెంకటేష్ కొంతకాలం నుండి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గల్ఫ్ శెట్టి బలిజ యువశక్తి వారు రూ.40 వేలు, మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.10వేలు మొత్తం కలిపి రూ.50 వేలు ఆదివారం బిళ్ళకుర్రు మట్టపర్తివారిపాలెంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ గారి చేతులు మీదుగా యువకుడుకి అందించారు. ఈ కార్యక్రమంలో కట్టా భాస్కర్, గుబ్బల శ్రీను, వాసంశెట్టి చినబాబు, బొక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్, 'గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి'


పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమెల్లి సతీష్ కుమారి

## కాలువ పూడిక తీయించిన వెంకటాయపాలెం సర్పంచ్

ప్రజాశక్తి-రామచంద్రపురం

వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి చేలు వర్షం నీటితో నిండిపోవడంతో నీటిని మురుగు కాలువలోకి మళ్లించేందుకు వీలు లేకుండా ఉంది. దీంతో మురుగునీటి కాలువలో పూడికను సర్పంచ్ సతీష్ కుమారి చొరవతో తొలగించారు. మండలంలోని వెంకటాయపాలెం గ్రామపంచాయతీ పరిధిలో భారీ వర్షాలకు వరి చేలల్లో ఉన్న వర్షంనీరు మురుగు కాలువలోకి కొన్నాళ్లుగా గుర్రపు డెక్క, చెత్త అడ్డు పడటంతో చిన్నంపేట నుంచి కుందూరు సరిహద్దు వరకు నిలిచిపోతోంది. దీంతో గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్ కుమారి చొరవ చూపి పూడికతీతను జెసిబి సాయంతో వర్షంలో తీయించారు. దీంతో రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ జెఇ, విఆర్ఒ గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఏటా.. వరద గండం

- బలహీనంగా ఏటిగట్లు
- గోదావరి ప్రవాహంతో మళ్లీ అగచాట్లు

ప్రజాశక్తి- రాజోలు

పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడెక్టుకు దిగువన ఉన్న పి.గన్నవరం మండలంలోని నాలుగు గ్రామాలు, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలను రాజోలుదీవిగా వ్యవహరిస్తారు. ఈ దీవికి రక్షణ కవచంలా వశిష్ఠ ఎడమ, వైనతేయ కుడిఏటిగట్లు ఉన్నాయి. 1986 ఆగస్టు 16న వచ్చిన అత్యంత ఉధృతి వరదకు పి.గన్నవరం మండలం నాగుల్లంక గ్రామం వద్ద, 2006 ఆగస్టు వరదలకు మొండెపులంకవద్ద వశిష్ఠ ఎడమ ఏటిగట్టుకు భారీగండ్లు పడటంతో రాజోలుదీవి ముంపుబారిన పడింది. ఈ రెండుసార్లు వశిష్ఠ ఎడమ ఏటిగట్టుకు గండ్లు పడినప్పుడు వరదనీరు పోటెత్తి రాజోలు దీవి ముంపులో చిక్కుకుని ప్రజలు అవస్థలు పడ్డారు. నేటికీ కొన్నిచోట్ల ఏటిగట్లను పటిష్టపర చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.

### తక్షణం చేపట్టాల్సిన పనులు

పి.గన్నవరం అక్విడక్టు నుంచి అంతర్వేది వరకు సుమారు 40 కి.మీ ఏటిగట్టులో 18 కి.మీ నేటికి పటిష్టపర్చలేదు. కోర్టుకేసులు, ఆక్రమణలు తొలగించక పోవటంతో అప్పట్లో ఈ పరిస్థితి నెలకొని నేటికీ ఆ ప్రదేశాలవద్ద ఏటిగట్లు బలహీనంగా ఉన్నాయి. లంకలగన్నవరం, నాగుల్లంక, తాటిపాక, సోంపల్లి, పొదలాడ, రాజోలు, రామరాజులంక, టేకిశెట్టి పాలెం, సఖినేటిపల్లి, రామేశ్వరం, గుడిమూల ప్రాంతాల్లో పటిష్ఠ పర్చాల్సిన అవసరం ఉంది. వైనతేయ కుడి ఏటిగట్టు నాగుల్లంక, మానేపల్లి, అప్పనపల్లి, పాశర్ల పూడి, పాశర్లపూడిలంక, ఆదుర్రు ఇలా మొత్తం రెండు కి.మీ మేర ఆయా ప్రాంతాల్లో ఏటిగట్టును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. నిధులు మం జూరు చేయకపోవడంతో బలహీన ఏటిగట్లు అలాగే ఉన్నాయి

### రెండేళ్లుగా మారనితీరు..!

2002లోవరదలు సృష్టించిన భయానక పరిస్థితులు మర్చిపోకుండానే మరలా గోదావరిలో ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరడంతో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. 2022లో వచ్చిన వరదలు గత 30 ఏళ్లలో ఎప్పుడూ చూడలేదని వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అంటున్నారు. కోనసీమలో ఏటిగట్టు బలహీనంగా ఉన్న 19 చోట్ల ఎక్కడో ఒక చోట గండి పడుతుందని ప్రజలు ఆందోళన చెందారు. ఎక్కడా గండి పడకపోయినా చాలా చోట్ల ఏటిగట్ల పై నుంచి వరద నీరు పొంగి పోర్లింది. రాజోలు మేకలపాలెం, నున్న వారి బాడవ, తాటిపాక మఠంలో ఏటిగట్టుకు సమాం తరంగా నీరు చేరి గట్టుపై నుంచి ప్రవహించడంతో అత్యంత భయంకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసు, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, యువకులు ప్రాణాలకు తెగించి రాత్రింబవళ్ళు ఏటిగట్టు పైనే ఉండి కిలోమీటర్ల మేర ఇసుక, సిమెంట్ బస్తాలు వేసి రాజోలు దీవిని కాపాడ గలిగారు. వశిష్ఠ, గౌతమి నదీ పరివాహక ప్రాంతాలైన మామిడికుదురు మండలం అప్పనపల్లి, బి.దొడ్డవరం ప్రాంతాలకు వెళ్లే కాజ్‌వే పై అడుగున్నర ఎత్తులో వరద నీరు చేరడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పి. గన్నవరం, కాట్రేనికోన, రావులపాలెం, ఆత్రేయపురం, నాగులంక, చాకలిపాలెం, మలికిపురం, సఖినేటిపల్లి, ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. నెమ్మదిగా గోదావరి శాంతించడంతో కోనసీమ ప్రాంత ప్రజలు వరదల నుండి బయటపడ్డారు.

### నెరవేరని అప్పటి సిఎం జగన్ హామీ

2022 జూలై నెలలో గోదావరికి వరదలొచ్చినపుడు రాజోలువద్ద వరదనీరు వశిష్ఠ ఎడమ ఏటిగట్టు మీదకు చేరింది. ఆ సమయంలో హెడ్‌వర్క్స్ ఇంజినీరింగ్ అధి కారులు ఇసుకబస్తాలు వేసి తాత్కాలిక రక్షణ చర్యలు చేప ట్టారు. అప్పటి సిఎం జగన్ వచ్చి తక్షణమే ఏటి గట్లు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. బల హీనంగా ఉన్న ఏటిగట్లను గుర్తించి హెడ్‌వర్క్స్ ఇంజి నీరింగ్ అధికారులు అప్పటి వైసిపి ప్రభుత్వానికి రూ.45కోట్లతో ప్రతిపాదనలు పంపినా నిధులు ఇవ్వలేదు.


గండి పడకుండా వేస్తున్న ఇసుకబస్తాలు(ఫైల్)


రాజోలు మధ్య లంక నుంచి కొబ్బరి కాయలను సురక్షిత ప్రాంతాలకు చేరుస్తున్న రైతులు

**నిధులు మంజూరు కాలేదు**

రాజోలు దీవిలో వశిష్ఠ ఎడమ, వైనతేయ కుడిఏటిగట్లకు సంబంధించి బలహీన ప్రదేశాలను గుర్తించి మూడేళ్లక్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. 2022లో వచ్చిన వరదలకు రూ.45కోట్ల నిధులు కావాలని మళ్లీ ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూకాలేదు. నిధొలొస్తే పనులు చేసేందుకు వీలుం టుంది.

-టివిఎల్ఎన్.మూర్తి, ఎఇఇ హెడ్‌వర్క్స్, రాజోలు

## అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదానం భవన నిర్మాణానికి ఆదివారం పలువురు విరాళాలు సమర్పించారు. జంగారెడ్డిగూడెంకు చెందిన తాడేమతి సాకేత్ కుటుంబ సభ్యులు రూ.20,116, భీమవరానికి చెందిన దొంగ జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులు రూ.10వేలు, ఏలూరు చెందిన మద్దిపాటి కార్తీక్ కుటుంబ సభ్యులు రూ.11,111, విజయవాడ చెందిన పకలపాటి మోహన సిద్ధ కిషోర్ అనురాధ దంపతులు రూ.1 లక్ష 5 వేలు, విజయవాడ చెందిన ఈశ్వరప్రసాద్ కుటుంబ సభ్యులు రూ.10,116, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ చెందిన దుర్గాడ బాల మురళీ ఆచారి పుష్పవతి దంపతులు కుటుంబ సభ్యులు రూ.10,116 ఆలయ డిసి భూపతి రాజు కిషోర్ కుమార్‌కు అందజేశారు. వీరికి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. .

## రహదారిపై గోతులు పూడ్చిన జనసేన నాయకులు

ప్రజాశక్తి -మామిడికుదురు రూరల్

నది తీర లంక గ్రామాలైన పెదపట్నంలంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి వెళ్లే ఆర్ అండ్ బి రహదారి కరకట్ట దిగువన 600 మీటర్ల గోతుల తో అధ్వానంగా మారింది. దీంతో లంక గ్రామాల ప్రజలు, నిత్యం బాల బాలాజీ దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోకపోవడంతో అప్పనపల్లి జనసేన నాయకులు ప్రొక్లెయినర్ ఆదివారం గోతులు పూడ్చారు ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కంకిపాటి నరసింహారావు, గ్రామ శాఖ అధ్యక్షులు యల్లమెల్లి ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలో వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న నలుగురు పంచాయతీ కార్య దర్శులకు ఉద్యోగన్నతులు ఆదివారం లభిం చాయి. మండలంలోని నర్శిపూడి పంచా యతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆర్‌వివిఎన్.సత్యనారాయణ, చెముడులంక పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న యు.రేణుక, మూలస్థానం అగ్రహారం కార్యదర్శిగా పనిచేస్తున్న పి.రాజు, బడుగువానిలంక కార్యదర్శిగా పనిచేస్తున్న కె.సుప్రియ ఈ ఉద్యోగోన్నతి లభించిన వారిలో ఉన్నారు. వీరిని ఆయా గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఉద్యోగోన్నతులు పొందిన నలుగురిలో ముగ్గురు కార్యదర్శులు అంబేద్కర్ కోనసీమ జిల్లాను ఎంపిక చేసుకోగా నర్శిపూడి కార్యదర్శి సత్యనారాయణ మాత్రం తూర్పు గోదావరి జిల్లాను ఎంచుకున్నారు.

## గల్ఫ్ బాధితుని కుటుంబ సభ్యులను కలిసిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-అంబాజీపేట

సౌదీ అరేబియాలో గల్ఫ్ ఏజెంట్ మోసానికి బలైవప్రాణాపాయ స్థితిలో అంబాజీపేట మండలం ఇసుకపూడికి చెందిన సరెళ్ళ వీరేంద్ర కుమార్ ఇంటికి కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశాల మేరకు కొత్తపేట ఆర్‌డిఒ జివివి.సత్యనారాయణ ఆదివారం బాధితుని తల్లిదండ్రులను కలసి ధైర్యం చెప్పారు. ఇండియన్ ఎంబిసి ద్వారా బాధితుని స్వదేశానికి తీసుకువస్తామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ఆర్‌డిఒ వెంట తహశీల్దార్ జె.విమల కుమారి, ఆర్ఐ ఎండి ఇబ్రహీం, విఆర్ఒ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## సమస్యల షరిష్కారానికి వినతి

ప్రజాశక్తి-ముమ్మిడివరం రూరల్

లైసెన్సుడ్ సర్వేయర్ల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ లైసెన్సుడ్ సర్వేయర్ల అసోసియేషన్ బృందం సిఎం చంద్రబాబును విన్నవించింది. మంగళగిరిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సిఎం నారా చంద్రబాబును రెవెన్యూ లైసెన్సుడ్ సర్వేయర్ల అసోసియేషన్ బృందం మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా సిఎంకు తమ సమస్యలు మొర పెట్టుకున్నారు. తమ వినతిపై సిఎం సానుకూలంగా స్పందించి తగు విధంగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ బందంలో జి.శ్యామ్ కుమార్, మనోహర్ కిరణ్, లీలాకృష్ణ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

## రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్షునిగా కాసు శ్రీను

ప్రజాశక్తి-రాజోలు:

రాజోలు రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కాసు శ్రీను నియమితులయ్యారు. ఆదివారం రాజోలు రోటరీ క్లబ్ లో 2024-25 సంవత్సరానికి నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం జరిగింది. అధ్యక్షునిగా కాసు శ్రీను, కార్యదర్శిగా కోదాటి సోమరాజు, కోశాధికారిగా నామన షణ్ముఖేశ్వరరావు, ఉపాధ్యక్షుడుగా జాయింట్ సెక్రటరీగా మహ్మద్ మొహిద్దీన్ తోపాటు మరోఎనిమిది మందితో నూతన కార్యవర్గం ఏర్పడింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.కళ్యాణ్ చక్రవర్తి ముఖ్య అతిధిగా పాల్గొని సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ రోటరీ వల్ల సేవా కార్యక్రమాలతో పాటు మానవ సంబంధాలు ఏర్పడతాయని అన్నారు. నూతన అధ్యక్షుడు కాసు శ్రీను మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో రాజోలు రోటరీని సేవా కార్యక్రమాల్లో మరింత ముందుకు తీసుకువెళ్తానని అన్నారు. అనంతరం రోటరీ నూతన సభ్యులు సోమిశెట్టి ఆంజనేయులు రోటరీ భోజనశాలకు ఐదు ఎసిలు బహూకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ బొరుసు వెంకట తిరుమల రావు, డాక్టర్ బసవ వరహాలు, ఏడిద కవీంద్ర, చిట్నీడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


కాసు శ్రీను

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్


ప్రజాశక్తి-అమలాపురం

గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతా వరణ శాఖ తెలిపిన నేపథ్యంలో సహాయం చర్యలకు సిద్ధంగా ఉండాలి జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. జిల్లా స్థాయి నుండి గ్రామస్థాయి వరకు అధికారులు అప్రమత్తం కావాలని ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ నుండి వరద ప్రభావత డివిజన్లు మండలాలు గ్రామస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వరద సహాయక చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ దిగువకు 7.5 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారని అన్నారు. ఈ రాత్రికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని అదే విధంగా సోమవారం ఉదయానికి వరద ఉధతికి అనుగుణంగా రెండో ప్రమాద హెచ్చరిక కూడా విడుదల చేసే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల. అధికారులు జిల్లాస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులు రానున్న మూడు రోజులపాటు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మొదటి వరద హెచ్చరిక కి అనుగుణంగా ముంపు బారిన వాడే ప్రాంతాల జాబితాను సిద్ధం చేసి జారీ చేశామన్నారు. ఆ ప్రకారం సహాయ చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు. అదేవిధంగా రెండు, మూడు వరద ప్రమాద హెచ్చరికలకు అనుగుణంగా చేపట్టాల్సిన సహాయక చర్యలపై అప్రమత్తమై ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టాలకు అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా సహాయక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.. ముంపు బారిన పడిన గ్రామాల్లో ముంపు బాధితులను తరలించేందుకు పడవలు, బోట్లు, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేయడంతో పాటు పునరావాస కేంద్రాలలో త్రాగునీరు ఆహారం కనీస వసతులు కల్పించాలని ఇప్పటికే మండల స్థాయి ప్రత్యేక అధికా రులను ఆదేశించామన్నాయరు. సహాయక చర్యలకు సచివాలయ సిబ్బందిని కూడా వినియోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు

### నేడు జిల్లాలో అన్ని విద్యాసంస్థలకు సెలవు

గోదావరి పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ధవలేశ్వరం బ్యారేజీ వద్ద సోమవారం ఉదయం నాటికి రెండవ ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద నీరు చేరుతుందని జల వనరుల అధికారులు అంచనా వేస్తున్న నేపథ్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సోమవారం అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించామని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు...సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కూడా రద్దు చేశామన్నారు.

### కార్టూ'నిజం'




టమాటాలతో తులాభారం

## నేరాలు ఘోరాలు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ నానాజీ

### వాటర్ ట్యాంక్‌లో పడి కార్మికుడు మృతి

**ప్రజాశక్తి - కాకినాడ రూరల్**

ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంక్లో పడి కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన కాకినాడ రూరల్ మండలం బొందగుంట గ్రామంలో ఆదివారం చోటుచేసుకొంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని బొందగుంటలో అనాధికారంగా నిర్వహిస్తున్న విజయ్ లక్ష్మి వాటర్ ప్లాంట్లో సలాది రక్షన్ ఆనంద్(40) గత 13 ఏళ్లుగా కెనాల్ వాటర్ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం విధిల్లో భాగంగా వాటర్ టెస్టింగ్ నిమిత్తం ట్యాంక్లోకి దిగాడు. ఈక్రమంలో వాటర్ లెవిల్ ఎక్కువ ఉండడంతో ఊపిరి ఆడక ట్యాంక్‌లోనే మృతి చెందాడు. లోతు ఎక్కువగా ఉన్నందున ప్రమాదవసాత్తు జారి పడి మృతి చెందినట్లు యాజమాన్యం తల్లిదండంద్రులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న సర్పవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తల్లితండ్రులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

**మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎంఎల్ఎ**

మృతి చెందిన రక్షన్ ఆనంద్ కుటుంబాన్ని ఎంఎల్ఎ పంతం నానాజీ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందాడా? లేక ఎవరైన హత్య చేసి వాటర్ ప్లాంట్‌లో వేశారా? అనేది తేలాల్సివుందన్నారు. ఇక్కడ నుంచి వాటర్‌ను ఫ్యూరీఫై చేసి వాటర్ ప్లాంట్ కంపెనీలకు సరఫరా చేస్తారని, ఈ ప్లాంట్‌కు ఎటువంటి అనుమతులు లేవని ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ తెలిపారని వివరించారు. ఈ వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు మాజీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అనుచరుడని, గత కొన్ని సంవత్సరాలుగా అనాధికారంగా నడుపుతున్నారని అన్నారు. ఈ ప్లాంట్ను తక్షణమే సీజ్ చేయాలని పరిశ్రమల శాఖకు ఆదేశించినట్లు తెలిపారు. అనుమతులు లేని వాటర్ ప్లాంట్లను గుర్తించి వాటిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు.

### దాడి ఘటనపై కేసు నమోదు

**ప్రజాశక్తి -శంఖవరం**

కత్తిపూడి పాద కొత్తూరు గ్రామంలో ఒక వ్యక్తిపై దాడికి యత్నించిన ఇద్దరుపై అన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తూరుకి చెందిన టిడిపి నాయకుడు కొయ్య రమణ రహదారి గుండా ఇంటికి వెళుతూ మార్గమధ్యలో తన బైక్ ఆపి ఫోన్లో మాట్లాడుతుండగా వెనుక నుంచి వైసిపి చెందిన తండ్రీ, కొడుకులు దూడల కనకరాజు, దూడల శివ తనపై కత్తితో దాడికి పాల్పడ్డారని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిషోర్ తెలిపారు.

### విషమంగానే రోడ్డు ప్రమాద బాధితుల పరిస్థితి

**ప్రజాశక్తి - కాకినాడ**

శనివారం రాత్రి స్థానిక కల్పన సెంటర్ సమీపంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన జక్కం దుర్గాప్రసాద్, కారు నడుపుతున్న చల్లా రామ్మోహన్ పరిస్థితి విషమంగానే ఉంది. ప్రస్తుతం వీరు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమయంలో కారులో ఉన్న పద్మ అనే మహిళ ప్రాణ ప్రమాదం తప్పి కోలుకుంటుందని పోలీసులు తెలిపారు.

**మద్యం మత్తే ప్రమాదానికి కారణమా?**

శనివారం రాత్రి స్థానిక కల్పనా సెంటర్ వద్ద జరిగిన ప్రమాదానికి ప్రధాన కారణం కారును నడుపుతున్న వ్యక్తి చల్లా రామ్మోహన్ మద్యం సేవించడమే కారణంగా తెలుస్తుంది. కారులో కూడా మద్యం సీసాలు లబ్యం కావడమే దీనికి నిదర్శనం. ఎఫ్ఆర్ కారులో మద్యం తాగుతు ఎదురుగా వస్తున్న బైక్ ను ఢీకొట్టగా ఇద్దరు మృతి చెందిన సంగతి విధితమే. ప్రమాదానికి ముందు కారును రామ్మోహన్ మద్యం సేవించి బీచ్ రోడ్డులో డ్రైవ్ చేసినట్లు తెలుస్తోంది. రామ్మోహన్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### 16 మందికి జరిమానా

**ప్రజాశక్తి - సీతానగరం**

సీతానగరం సెంటర్లో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం పలు ద్విచక్ర వాహన దారులకు జరిమానా విధించారు. నిబంధనలను ఉల్లంఘించిన 16 మందికి జరిమానాలు విధించామని ఎస్ఐ రామ కృష్ణ తెలిపారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని, విధిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలను వెంట పెట్టుకోవాలన్నారు.

### కోడి పందేలు ఆడుతున్న ఏడుగురు అరెస్ట్

**ప్రజాశక్తి - గోపాలపురం**

మండలంలోని భీమోలు గ్రామంలో కోడి పందేల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్టు చేశారని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులు, 12 ద్విచక్ర వాహనాలు, రూ.14,500 నగదు సీజ్ చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

### మద్యం మత్తులో యువకుల హల్‌చల్

**ప్రజాశక్తి - కాజులూరు**

మద్యం మత్తులో పలువురు యువకులు హల్‌చల్ చేస్తున్నారు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో యానాం వెళ్తున్న యువకులు పూటుగా మద్యం సేవించి ఇష్టారీతిలో కార్లుల, ద్విచక్రవాహనాలపై వస్తూ ఇతర ప్రయాణిలను ఆందోళనకు గురిచేస్తున్నారు. ఆదివారం రాజమహేంద్రవరం, రామచంద్రపురం, మండపేట ప్రాంతాలకు చెందిన యువకులు మద్యం సేవిస్తూ స్వైర విహారం చేశారు. స్థానికులు ప్రశ్నిస్తే ఇష్టానుసారంగా వారిపై మాటల యుద్ధానికి దిగారు. అధికారులు స్పందించి ప్రతి శనివారం, ఆదివారం ఈ రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రధాన దృష్టి

## డిపిఒ భారతీ సౌజన్య






**ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి**

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా జిల్లాలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలపై ప్రధానంగా దృష్టి సారించామని కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీసౌజన్య అన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించి కొన్ని కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాకినాడ జిల్లాలో 265 క్లస్టర్ల పరిధిలో 385 గ్రామ పంచాయతీలున్నాయన్నారు. ఇంకా పలు అంశాలను ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో వెల్లడించారు.

**పారిశుధ్యంపై ఎటువంటి దృష్టిని సారించారు.?**

జిల్లాలోని అన్ని పంచాయతీల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం, డ్రెయినేజీల క్లీనింగ్ కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగించబడుతుంది. పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక కృషి జరుగుతుంది.

**తాగు నీటి సరఫరాపై ఎటువంటి చర్యలు చేపట్టారు.?**

గ్రామాల్లో తాగు నీటి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ గ్రామపంచాయతీలో నీటిని క్లోరిన్ శాతంను క్లోరోస్కోపుల ద్వారా తనిఖీ చేసుకుని ప్రజలకు సరఫరా చేయబడుతుంది. క్షేత్రస్థాయిలో తాగునీటి పైపులు మరమ్మతులు, మంచినీటి పథకం ట్యాంకులు పరిశుభ్రత, తాగునీటి పరీక్షలు జరుపుతున్నాం. సచివాలయ సిబ్బంది ద్వారా ఇది నిరంతరాయంగా జరుగుతుంది.

**పన్నుల వసూళ్ల తీరు, బకాయిల వివరాలు?**

జిల్లాలోని ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి. ఇంటి పన్నుల రూపేణా జిల్లాలో రూ.60.79 కోట్లు డిమాండ్ ఉండగా ఇప్పటి వరకు 39.32 కోట్లు (64.68 శాతం) వసూలు అయింది. అలాగే కుళాయి, చెట్లు, చేపల చెరువులు, గడ్డి పాటలు, లైసెన్సు ఫీజులు ఇలా నాన్ టాక్సులు రూపేణా రూ.9.66 కోట్లకు గానూ ఇప్పటి వరకు 4.62 కోట్లు (48 శాతం) వసూలు అయింది. మిగిలిన పన్నులను త్వరితగతిన వసూలు చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

**వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. పరిష్కారానికి చర్యలు?**

వీధి లైట్ల నిర్వహణ పట్ల కొన్ని సమస్యలు గతంలో ఉత్పన్నం అయ్యేవి. అనగా కొన్ని ప్రాంతాల్లో వెలగడం, మరికొన్ని ప్రాంతాల్లో వెలగక పోవడం, చాలా చోట్ల వెలుగుతూనే ఉండడం వంటి వాటిని నిరోధించుట జరిగింది. ప్రస్తుతం ఈ విషయమై నిర్వహణ బాధ్యతను స్థానిక పంచాయతీ, సచివాలయ సిబ్బందే తీసుకున్నారు. వీధిలైట్లు సమస్య వచ్చిన వెంటనే స్థానిక గ్రామపంచాయతీ సిబ్బందిచే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

**ఆర్థిక సంఘాల నిధులను ఎలా ఖర్చు చేస్తున్నారు.?**

15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామపంచాయతీలకు 2023-2024 మొదటి విడత రూ.27.03 కోట్లు విడుదల కాగా వాటి నుంచి పంచాయతీల వీధిలైట్లు, మంచినీటి సరఫరా స్కీముల విద్యుత్తు బకాయిలను చెల్లింపు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ప్రకారం తాగునీరు, పారిశుధ్యం, గ్రీన్ అంబాసీడర్లు జీతాలు చెల్లింపు, మంచినీటి పైపు లైను నిర్వహణ తదితర ఖర్చులు చేయుట జరుగుతుంది. ప్రభుత్వం నుంచి 2023- 2024 సంవత్సరంకు సంబంధించి రెండవ విడత నిధులు విడుదల కావాల్సి ఉంది.

**డిజిటల్ పేమెంట్స్ విధానం అమలవుతుందా ?**

గ్రామ పంచాయితీల నిధుల నుంచి జరిగే అన్ని రకాల ఖర్చులు డిజిటల్ విధానం ద్వారా నేరుగా లబ్ధిదారు ఖాతాకు మాత్రమే చెల్లించబడుతుంది. అంటే గ్రామ పంచాయతీ సాధారణ నిధులను సిఎఫ్ఎంఎస్ పోర్టల్ ద్వారా మరియు 15వ ఆర్థిక సంఘ నిధులను పిఎఫ్ఎంఎస్ పోర్టల్ ద్వారా ఆపరేట్ చేయబడుచున్నవి. ఈ విధానంలో ఏదైనా గ్రామ పంచాయతీలో అవకతవకలు జరిగినట్లుగా జిల్లా యంత్రాంగం దృష్టికి వస్తే అమలులో ఉన్న నిబంధనల మేరకు సంబంధిత సిబ్బంది, సర్పంచులపై చర్యలు తీసుకోబడతాయి.

**జిల్లాలో అక్రమ లే అవుట్లు ఎన్ని ఉన్నాయి. వాటిపై ఎటువంటి చర్యలు చేపట్టారు.?**

జిల్లా లో సుమారు 160 అక్రమ లే అవుట్లు ఉన్నాయి. అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకునే అధికారం కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ వారికే ఉంది.

**గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకొస్తారా.?**

గ్రామ పంచాయితీల్లో ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నందున సామూహిక మరుగుదొడ్లు ఏ గ్రామములోనూ నిర్వహించబడడం లేదు. ఆ విధంగా గతములో నిర్వహించబడిన సామూహిక మరుగుదొడ్లు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా అందరు గ్రామ పంచాయతీ సిబ్బందికి పలు సమీక్ష సమావేశాల్లో సూచనలు జారీ చేశాము. ఈ విధంగా ఏదైనా గ్రామంలో సామూహిక మరుగుదొడ్లు అన్యాక్రాంతం అయినట్టుగా జిల్లా యంత్రాంగం దృష్టికి వస్తే సిబ్బందిపై తగు క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటాం.

## 'అసాధ్యాలను సుసాధ్యాలు చేయాలి'

**ప్రజాశక్తి - సామర్లకోట**

లయన్స్ సభ్యులంతా అసాధ్యాలను సుసాధ్యాలు చేయాలని లయన్స్ ఇంటర్ నేషనల్ బోర్డు అప్పాయింటి, ఇనస్టలేషన్ అధికారి వి.విజయకుమార్ అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ 316 బి డిస్ట్రిక్ట్ క్లబ్ గవర్నర్‌గా ఈదల ఈశ్వరకుమార్, కాబినెట్ నూతన కమిటీ ప్రమాణాస్వీకారం స్థానిక పూర్ణ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ సభ్యులు అందరిలోనూ ఒక మంచి లీడర్ ఉన్నాడన్నారు. ఆ నాయకత్వాన్ని బయటకు తీసుకు రావాలన్నారు. సామర్లకోట శ్రీ భీమేశ్వర లయన్స్ క్లబ్ ఏర్పడి కేవలం 25 సంవత్సరాలు మాత్రమే అవుతుండగా జిల్లానుంచి ఈశ్వరకుమార్ గవర్నర్ కావడం విశేషమన్నారు. అయితే ఈ ఏడాదిలో తూర్పు గోదావరి జిల్లాలో సర్వీస్ మిషన్‌లో కాకినాడలో ఒక పెద్ద ప్రాజెక్ట్ ఏర్పాటు చెయాలని అన్నారు. లయన్స్ ఇంటర్ నేషనల్ క్లబ్ ద్వారా ఏటా రూ.150 నుంచి రూ.180 కోట్లు కేవలం ప్రాజెక్టులకు కేటాయిస్తున్నట్టు చెప్పారు. రాజమహేంద్ర వరంలో బ్లడ్ బ్యాంక్ కు రూ. కోటి నిధులు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈదల ఈశ్వర్ కుమార్ దంపతులచే ప్రమాణస్వీకారం చేయించి అధికార దండాన్ని పాస్ట్ గవర్నర్ల చేతులమీదుగా అందజేశారు. అలాగే జిల్లా క్లబ్ పరిధిలోని డిస్ట్రిక్ట్ ఛైర్మన్‌లు, జోన్ ఛైర్మన్‌లు, రిజియన్ ఛైర్మన్‌లు, కాబినెట్ ట్రెజరర్స్, అడిషనల్ ట్రెజరర్స్‌కు ఆయన బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ మొదటి వైస్ గవర్నర్ వజ్రపు కోటేశ్వర రావు, రెండో వైస్ గవర్నర్ చిట్టీనీది శ్రీనివాసు, లలిత ఇండస్ట్రీస్ ఎండి మట్టే శ్రీనివాసు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ చందలాద అనంత పద్మనాభం, డిస్ట్రిక్ట్ మొదటి మహిళ ఈదల మంగాదేవి, జిల్లా కేబినెట్ నాయకులు ఎన్.సూర్యానారాయణ, ఎం.శివ నాగకృష్ణ, సింగవరపు సత్యనారాయణ, నేతి వీరబాద్రరావు, అమలకంటి శ్రీనివాస్, పాస్ట్ గవర్నర్‌లు బాధం బాలకృష్ణ, మాటూరి మంగతాయారు, బివిఎన్.రెడ్డి, కోడూరి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.


నూతన గవర్నర్ గా ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నిర్వాహకులు

## వరద ఉధృతిని పరిశీలించిన ఆర్ఎంఒ

**ప్రజాశక్తి - యానాం**

యానాం గౌతమి గోదావరి నది వరద ఉధృతి పెరు గుతుండడంతో ఆదివారం ఆర్ఎఒ మునిస్వామి వివిధ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాజీవ్ బీచ్, యానాం - ఎదుర్లంక బాలయోగి వారధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యూడి ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ళ నాగరాజు పాల్గొన్నారు.


బాలయోగి వారధి వద్ద పరిశీలిస్తున్న ఆర్ఎఒ

## తూరంగిని కార్పొరేషన్‌లో విలీనం చేయాలి

**ప్రజాశక్తి - కాకినాడ రూరల్**

గత 13 ఏళ్లుగా పాలకవర్గమే లేని తూరంగిని కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీని పౌర సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఆదివారం పౌర సంక్షేమ సంఘం నాయకులు చింతపల్లి అజయ్ కుమార్‌తోపాటు, తూరంగి ప్రతినిధి వర్గం ఎంఎల్ఎను కలిసి వినతిపత్రాన్ని అందించారు. పాలకవర్గం లేకపోవడంతో కార్యదర్శుల ఇష్టారాజ్యంగా పాలన సాగిస్తున్నారని వివరించారు. నిధుల లేమితో ప్రజలు తాగునీటి ఇబ్బందులతోపాటు, మురుగు కాలువల్లో పూడిక తీసే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. తమ గ్రామాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేయకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకుందని వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నానాజీ మాట్లాడుతూ 8 గ్రామాల విలీనం అంశంపై ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగా అప్పారావు, ఎన్.రమేష్, జోగా వసుంధర, శర్మ, కుమార్ పాల్గొన్నారు.


ఎంఎల్ఎకు వినతిపత్రం ఇస్తున్న తూరంగా వాసులు

## గౌరవప్రదమైనది న్యాయవాద వృత్తి

**తెలంగాణ హైకోర్టు జస్టిస్ సాంబశివరావు నాయుడు**

**ప్రజాశక్తి-రామచంద్రపురం**

అన్ని వృత్తులలోను న్యాయవాద వృత్తి గౌరవప్రదమైనదని తెలంగాణ హైకోర్టు జస్టిస్ సాంబశివరావు నాయుడు అన్నారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్ లో న్యాయవాదిగా చేస్తూ న్యాయమూర్తిగా ఉద్యోగం సంపాదించి అంచెలంచలుగా పదోన్నతులు పొంది తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నత పదవిని చేపట్టిన జస్టిస్ సాంబశివరావు నాయుడును స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవి చీమలపాటి మాట్లాడుతూ న్యాయవాదులు ఎప్పటికప్పుడు మారుతున్న న్యాయ శాస్త్రాల్లో మెలకువలు తెలుసుకోవాలన్నారు.దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ దేశంలో న్యాయవ్యవస్థ విశిష్ట తను కొనియాడారు. జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన ఒక న్యాయవాది రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానానికి న్యాయమూర్తిగా ఎదగడం అనేది హర్షించదగ్గదన్నారు. సమావేశానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి మోహన్ వెంకట రమణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది కె. సార్వభౌమరావు, రిటైర్డ్ జిల్లా జడ్జి డిఎల్.కామేశ్వరి అడిషనల్ జిల్లా జడ్జి ఎం.మాధురి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జిలు నిజాం శారద, వి.నాగేశ్వరరావు నాయక్, ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి, బార్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తికి సన్మానం

# గోదావరికి పెరుగుతున్న వరద ఉధృతి

- ఆందోళన చెందుతున్న లంక గ్రామాల ప్రజలు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం

**ప్రజాశక్తి-యంత్రాంగం**

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొద్ది రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. గోదావరికి పెరుగుతున్న వరద ఉధృతితో లంకగ్రామాల ప్రజల ఆందోళన చెందుతున్నారు.

**రామచంద్రపురం:** గౌతమీ గోదావరికి వరద నీటి ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా బలహీనంగా ఉన్న ఏటిగట్ల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రామచంద్రపురం ఆర్‌డిఒ సుధాసాగర్ అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన కోటిపల్లి నుండి సుందరపల్లి వరకు గల గోదావరి ఏటిగట్టును అధికారులతో కలిసి పరిశీలించారు .కె.గంగవరం మండలం సుందరపల్లి గ్రామం వద్ద గోదావరి ఏటి గొట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాన్ని ఆర్‌డిఒ పరిశీలించారు. ముందస్తు జాగ్రత్తగా తొమ్మిది వేల ఇసుక బస్తాలు సిద్ధం చేసామని కె.గంగవరం తహశీల్దార్, రవీంద్రనాథ్ నీటిపారుదల శాఖ అధికారులు తెలియజేశారు.విఆర్ఒ కష్ణ సాయి, గ్రామ సర్పంచ్ పెమ్మాడి బేబీ సత్తిబాబు తదితరులు ఉన్నారు. **కపిలేశ్వరపురం:** మండలం లో పలుచోట్ల బలహీనంగా ఉన్న ఏటిగట్టు ప్రాంతాలను ఆదివారం రామచంద్రపురం ఆర్‌డిఒ సుధాసాగర్ పరిశీలించారు. ఆయన వెంట ఇరిగేషన్, రెవెన్యూ, అధికారులు ఉన్నారు. **మామిడికుదురురూరల్:** ఎగువ ప్రాంతాల్లో కురుసున్న భారీ వర్షాలతో పాటు గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తూ ఉండటంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నం లంక, బి.దొడ్డవరం పాశర్లపూడి పల్లవ పాలెంలలో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాదహెచ్చరిక జారీ అయితే అప్పనపల్లి, బి.దొడ్డవరం కాలనీలు నీట మునిగే అవకాశం ఉంది. ఇప్పటి కే పశుగ్రాశం నీట మునిగింది.

**రెండు జిల్లాల మధ్య వరద నీట మునిగిన కాజు వే**

వాడ్రేవుపల్లి శివారు చాకలిపాలెం వద్ద కోనసీమ-పశ్చిమ గోదావరి జిల్లాలను కలిపే కనకాయిలంక కాజ్‌వే పైకి ఆదివారం వరదనీరు చేరీ రవాణా సదుపాయాలు నిలిచి పోయాయి. వరద ప్రభావిత ప్రాంతాలైన పెదపట్నం, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక ప్రాంతాలను ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పరిశీలించారు లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు కనకాయలంక కాజ్ వే నీట మునగడంతో రెండు జిల్లాల పరధిలోని లంకగ్రామ ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది

**కూలిన కల్వర్టు గోడ**

**ఆత్రేయపురం:** భారీ వర్షాలకు మండల పరిధిలోని మెర్లపాలెంలో ఆదివారం కాలిబాట వంతెన రైలింగ్ గోడ కూలిపోయింది. స్థానిక మావుళ్ళమ్మ గుడి సమీపంలో ఉన్న కాలిబాట వంతెన ద్వారా బండారు కాలనీ వాసులు రాకపోకలు సాగిస్తుంటారు. కూలిన రైలింగ్ వాల్ వలన చిన్నారులు రాకపోకలు సాగించే సమయంలో ఎటువంటి ప్రమాదాల బారిన పడకుండా రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు ఐరన్ పోల్స్ తో రైలింగ్ ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

**రైతులను అన్ని విధాల ఆదుకుంటాం**

**ముమ్మిడివరంరూరల్:** భారీ వర్షాలకు నీట మునిగి పంట నష్టపోయిన వరి రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు హామీనిచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో ముంపు బారిన పడిన అన్నంపల్లి, కొత్తలంక గ్రామాల్లోని వరిచేలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, చెల్లి అశోక్, అర్ధాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు. భారీ వర్షాలకు మండలంలో వృద్ధ గౌతమి అయినాపురం ప్రధాన పంట కాలవల పక్కన ఉన్న వరి పొలాలు నీటితో మునిగాయి. అయినాపురం, కొత్తలంక, సిహెచ్ గున్నేపల్లి తదితర గ్రామాల్లో వరి పొలాలను సర్ ప్లస్ వియర్ ద్వారా వచ్చే నీరు ముంచేత్తుతోంది. గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో మురుగు కాలవలోని నీరు గోదావరిలోకి విలీనం చేసే అవుట్ పాల్ స్లుయిస్ షట్టర్లను మూసి వేయడంతో నీరు నిలిచిపోయింది. బొబ్బర్లలంక-పల్లంకుర్రు ప్రధాన పంట కాలవలోని అయినాపురం సర్ ప్లస్ వియర్ ద్వారా వదిలే నీరు కూడా మురుగు కాలవల నుంచి పొలాల్లోకి చేరడంతో ముంపు నుండి తేరుకోవడం లేదు. రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే వరి పైరు కుల్లి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి ఎగువన నీటిమట్టం పెరగడ నాటు పడవలతో రాకపోకలు సాగించరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.


మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

## గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

**ప్రజాశక్తి అమలాపురం**

గ్రామీణ స్థాయి నుండి క్రీడలను అభివద్ధి చేసి, తద్వారా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి వారిని ఒలింపిక్ స్థాయి వరకు తీసుకు వెళ్లేందుకు కషి చేస్తానని జిల్లా క్రీడాభారతి అధ్యక్షులు అల్లాడ శరత్ బాబు అన్నారు. అమలాపురానికి చెందిన అల్లాడ శరత్ బాబు జిల్లా క్రీడాభారతి అధ్యక్షులుగాను, పప్పుల శ్రీరామచంద్ర మూర్తి కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా స్థానిక హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ నందు ఆదివారం కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సభ్యులు ఘనంగా సత్కరించారు. శరత్ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఇండోర్ లో జరగబోయే జాతీయస్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన బి.అప్పన్నను సభ్యులు సన్మానించారు. ఈకార్యక్రమంలో కోనసీమ పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎనుముల కష్ణ పద్మరాజు, వంటెద్దు వెంకన్నాయుడు, ఉపాధ్యక్షులు గారపాటి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## శ్లాబ్ నిర్మాణానికి సాయం

**ప్రజాశక్తి - ఆలమూరు**

మండలంలోని సంధిపూడి పంచాయతీ వద్ద ఉన్న దివంగత వంగవీటి మోహన రంగా విగ్రహా రక్షణకు స్థానిక రంగ యూత్ ఆధ్వర్యంలో రూఫ్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అలాగే అరవపల్లి అయోధ్య రాము జ్ఞాపకార్థం నిర్మాణానికి పూనుకున్నారు. కాంక్రీట్ శ్లాబ్ వెయ్యడానికి భారీ మొత్తంలో ఖర్చు అవుతున్న నేపథ్యంలో విరాళాలు సేకరిస్తున్నారు. దీంతో స్పందించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన కార్యదర్శి, పినపల్ల సర్పంచ్ సంగీత సుభాష్ రూ.10 వేలు తన వంతు సాయంగా రంగా యూత్ సభ్యులకు ఆదివారం అందజేసి, అభినందించారు. దీంతో సర్పంచ్ సుభాష్ కు సంధిపూడి రంగా యూత్ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

## వెటర్నరీ నాన్ గ్రాడ్యుయేట్ సంఘం అధ్యక్షునిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - ఆలమూరు

ఎపి వెటర్నరీ నాన్ గ్రాడ్యుయేట్ ఫెడరేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ ఈదల శ్రీనివాస్ చౌదరి రెండోసారి ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నికయ్యారు. మండలంలోని పినపళ్ల పశువైద్యాధికారిగా పనిచేస్తున్న ఆయన ఫెడరేషన్ చరిత్రలో రెండోసారి ఎన్నిక కావడం ఇదే ప్రథమం. ఇందులో ఫెడరేషన్ అధ్యక్షునిగా డాక్టర్ ఈదల శ్రీనివాస్ చౌదరి, ఉపాధ్యక్షులుగా కె.వి.రామరాజు, రుక్మతరావు, అప్పన్న బాబు, సహాయ అధ్యక్షునిగా ఎస్ వీర్రాజు, కార్యదర్శిగా సాంబమూర్తి, కోశాధికారిగా ఎం.రామారావు, జాయింట్ సెక్రటరీలుగా ఆర్ శ్రీనివాస్, జీవీవీ.సత్యనారాయణలను కాకినాడలో ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఆయన మండల కేంద్రం విలేకరులకు తెలిపారు. శ్రీనివాస్ చౌదరిని వివిధ జిల్లాల నుంచి వచ్చిన యూనియన్ నాయకులు సత్కరించి అభినందనలు తెలియజేశారన్నారు.